వరద కాల్వల నిర్మాణం వేగవంతం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో వరద నీటి కాలువల నిర్మాణం వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా గురుకుల్ విద్యాపీఠం, జిల్లా కోర్టు, ఎస్‌బీఐ కాలనీల్లో జరుగుతున్న వరద నీటి కాలువల నిర్మాణాన్ని గురువారం ఆయన పరిశీలించారు. డస్ట్, వెట్ మిక్స్ వేసి కాలువలు, రోడ్లకు మధ్య ఉన్న భాగాన్ని పూర్తి చేయాలని, ప్రారంభంలోనే ప్లాస్టిక్ చెత్త చేరకుండా మెస్ ఏర్పాటుచేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ సమీపంలో జరుగుతున్న పనులను వెంటనే పూర్తి చేయాలని, స్టేషన్లకు వచ్చే పౌరులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ గ్యారేజ్ వద్ద జరుగుతున్న మురుగు కాల్వ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నాగార్జున స్కూల్ దారిలో ఉన్నటువంటి డ్రైన్ నిండిపోయి రోడ్డుపైకి మురికి నీరు ప్రవహించడాన్ని గమనించిన కమిషనర్ గల్ఫర్ మిషన్ ద్వారా నీటిని తొలగించాలని ఆదేశించారు. స్లాబ్‌కు సరైన క్యూరింగ్ చేయాలని, పనులు పూర్తయిన తర్వాత చెత్తా చెదారాన్ని తొలగించాలన్నారు. స్టేట్ గెస్ట్ హౌస్, ఆఫీసర్స్ క్లబ్ ముందు ఉన్న కాలువలపై స్లాబ్స్ వేయాలని సూచించారు. ఎస్‌బీఐ కాలనీ పార్కు నుంచి కాలువల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం 47వ డివిజన్ నందు పెన్షన్ పంపిణీని కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


వరద నీటి కాలువల నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

వైవీయూ పీజీ కళాశాల ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం అని.. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బాబు జగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా వైవీయూలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన బాబు జగ్జీవన్‌రామ్ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. 1971 ఇండో-పాక్ యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణమంత్రిగా క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ ఎజి.దాము మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ మంత్రిగా ఆహార సంక్షోభాన్ని నివారంచడంలో ఆయన పనితీరు అద్వితీయమన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య సుబ్బరాయుడు, డాక్టర్ వెంకట్రామ్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీయూ పీజీ కళాశాల ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి

చివరి శుక్రవారం.. ప్రత్యేకం

మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

కడప కల్చరల్ : ముస్లిం ప్రపంచానికి శుక్రవారం అత్యంత పవిత్రమైన రోజు. ప్రతివారం సాధారణంగా వచ్చే శుక్రవారాన్ని కూడా వారు ఎంతో పవిత్రమైనదిగా గౌరవిస్తారు. అయితే రంజాన్ మాసంలో వచ్చే చివరి శుక్రవారాన్ని అద్భుతమైనదిగా, స్వర్గం చేరేందుకు పుణ్యదాయకమైన మార్గంగా భావిస్తారు. ఈ శుక్రవారం ప్రార్థనల్లో తప్పక పాల్గొనాలని ఆశిస్తారు. మళ్లీ ఒక ఏడాదిపాటు ఈ శుక్రవారం కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది గనుక... అల్లాహ్ ప్రసాదించిన 'జుమ్మా' రోజును విశేష ప్రార్థనలతో ఫలప్రదం చేసుకునేందుకు ప్రతి ముస్లిం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాడు. ఈ ప్రార్థనల కోసం మసీదులు సిద్ధమయ్యాయి.

ప్రత్యేక ప్రాధాన్యం

వారంలో శుక్రవారాన్ని ముస్లింలు దైవ ప్రార్థనకు అత్యంత ఉత్తమమైనదిగా భావిస్తారు. మిగతా ఆరు రోజుల్లో మసీదుల్లో ప్రార్థనలు మాత్రమే నిర్వహిస్తారు. జుమ్మా రోజున ప్రార్థనలతోపాటు మత గురువులు దైవ సందేశం ఇస్తారు. మిగతా రోజుల్లో ఆధ్యాత్మిక సందేశం వినే అవకాశం ఉండదు గనుక జుమ్మా రోజున మాత్రం దైవ సందేశం వినే అవకాశం లభిస్తుందని తప్పక వెళతారు.

ఆ పవిత్ర ఘడియ కోసం

మిగతా రోజులతో పోలిస్తే ఈ శుక్రవారానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా జొహర్ నమాజ్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. చిన్న పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు స్నానాలు ఆచరించి శుభ్రంగా, సంప్రదాయంగా ఉండే దుస్తులు ధరించి ప్రార్థనల్లో నిమగ్నమవుతారు. మగవారు ఆజాన్ అయిన వెంటనే మసీదులకు చేరుకుంటారు. ఎంత ముఖ్యమైన కార్యక్రమమైనా పుణ్యదాయకమని భావించినా నమాజ్ అనంతరమే వాటిని ఆచరిస్తారు. నమాజ్ సమయంలో ఏ ఇతర కార్యక్రమాలు పెట్టుకోకుండా ప్రార్థనల్లో నిమగ్నమవుతారు. ప్రార్థనల తర్వాత పేదలకు దానధర్మాలు చేస్తారు. సాయంత్రం ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. జుమ్మా రోజున ప్రత్యేకంగా ఒక ఘడియ ఉంటుందని, ఆ సమయంలో భక్తులు ఏదీ కోరుకున్నా అల్లాహ్ తప్పక అనుగ్రహిస్తాడని ముస్లింలు విశ్వసిస్తారు. జుమ్మా నమాజుకు ముందుకు రెండు ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి. మొదటిదానిలో ఇమామ్ దైవ శోస్త్రం, ప్రవక్త గుణగణాలు, ఆయన చేకూర్చే శుభాలను తెలియజేస్తారు. రెండవ భాగంలో ఖురాన్‌లోని పలు భాగాలను వినిపిస్తారు. జుమ్మా రోజున అజాన్ అయినప్పటి నుంచి నమాజ్ పూర్తయ్యే వరకు ముస్లింలు ప్రాపంచిక విషయాలను మానేసి దైవచింతనతో గడపాలని ఖురాన్ పేర్కొంటోంది.

ప్రత్యేకమైన సందడి

శుక్రవారాన్ని 'ఈదుల్ మోమిమీన్' అని పేర్కొంటారు. అంటే పండుగ వంటిదని అర్థం. మిగతా రోజులకంటే శుక్రవారం రోజున మసీదులకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు. అన్ని మసీదులు భక్తులతో నిండిపోతాయి. మిగతా రోజుల్లో వీలు గాకపోయినా శుక్రవారం నాడు రోజా విరమణ సందర్భంగా ముస్లింలు ఇతరులకు తమ చేతనైనా కొద్ది ఫలహారం అందించి పుణ్యఫలాలు పొందుతారు.

లక్ష్య సాధనకు విద్యార్థిదశ కీలకం


హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి

వైవీయూ : ఉజ్వల భవిష్యత్తుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థి దశ ఎంతో కీలకమని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో 75వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరీర్‌పై దృష్టి సారించి, తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేలా రాణించాలన్నారు. ఉన్నత విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి.బాబు మాట్లాడుతూ కళాశాల నుంచి పట్టా తీసుకుని బయటకు వెళ్లే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా గుర్తింపు సాధించాలన్నారు. చదువుకొనే సమయంలోనే కెరీర్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. నూతన శాస్త్ర, సాంకేతికతను సక్రమంగా వినియోగించుకుని పోటీ ప్రపంచంలో అవకాశాలను దక్కించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ కళాశాల అభివృద్ధి నివేదిక చదివి వినిపించారు. అనంతరం వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు అతిథులు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి

ఐపీసీ పార్టీ సౌతిండియా కార్యాలయం ప్రారంభం

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలోని ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పనిచేస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పద్మాకర్ ఐజక్ అన్నారు. గురువారం కడప నగరంలో దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యాలయాన్ని స్టార్ కాంపెయినర్ శివపావనితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చిన అభివృద్ధి చేయడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాల్లో తా ము పోటీ చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ఎజెండా అని తెలిపారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్: పాతమార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేసి విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో రతనాల వేంకటేశ్వరస్వామి

ప్రపంచ దేశాలు మెచ్చిన నేత అంబేద్కర్

వైఎస్సార్‌సీపీ నేత డా.సొహైల్

కడప కార్పొరేషన్ : ప్రపంచ దేశాలు మెచ్చిన నేత భారత రత్న డా.బీఆర్ అంబేద్కర్ అని జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి.సంపత్‌కుమార్ అన్నారు. పాతకడపలో మాల మహాసేన ఆధ్వర్యంలో గురువారం బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలకంటే మిన్నగా భారత దేశానికి రాజ్యాంగాన్ని అందించిన డా. బీఆర్ అంబేడ్కర్ ఎంతో గొప్పవారన్నారు. ఆ రాజ్యాంగం ప్రకారమే దేశంలో పాలన సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ మాల మహాసేన సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డా. సొహైల్

దాతృత్వానికి మారుపేరు సంపత్ కుమార్

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ సాహితీ యజ్ఞం నిర్వహించిన చోట ఆయన జ్ఞాపకార్థం బాషా పరిశోధన కేంద్రం ఉద్భవించడానికి ప్రధాన కారకులైన సీకే సంపత్ కుమార్ దాతృత్వానికి మారుపేరని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి అన్నారు. సంపత్ కుమార్ వర్ధంతి సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి మంగళవారం నివాళులర్పించారు. అనంతరం రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ 1976లో రచయితల సమావేశానికి వచ్చిన ప్రముఖ కవులు ఆరుద్ర, ఆచార్య జీఎస్ రెడ్డి, బంగోరెల కృషి గురించి బ్రౌన్ పేరిట గ్రంథాలయం నిర్మించాలన్న వారి సూచన, అనంతరం జరిగిన పరిణామాల గురించి తెలియజేశారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ సీకే కృష్ణస్వామి, సంపత్‌కుమార్ దాతృత్వం కారణంగానే నేడు బ్రౌన్ గ్రంథాలయం, భాషా పరిశోధన కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ఆయన కాంస్య విగ్రహాన్ని గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసి ఆయనపై ప్రత్యేక సంచికను ఆవిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధన కేంద్రం జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, జి.రంగ తదితరులు పాల్గొన్నారు.


సంపత్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

చంద్రబాబును ప్రజలే సస్పెండ్ చేయాలి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వీరపునాయునిపల్లి : వలంటీర్ల సేవలను ఆపించిన చంద్రబాబును ప్రజలే సస్పెండ్ చేయాలని ఆయన ప్రజలను కోరారు. గురువారం మండలంలోని మొయిళ్లచెరువు గ్రామంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డితో కలసి పాల్గొని మాట్లాడారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు ఇస్తున్న వలంటీర్ల సేవలను ఆపించిన చంద్రబాబును ఈ ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెప్పి సస్పెండ్ చేయాలని ప్రజలను ఆయన అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వీడ్కోలు పలికేందుకు సిద్ధమవ్వాలన్నారు. ఎన్నికల సమరంలో ఒంటరిగా పోటీ చేసేందుకు దమ్ము, ధైర్యం లేక చంద్రబాబునాయుడు అన్ని రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకున్నాడన్నారు. మండలంలోని మొయిళ్లచెరువు, ఎస్.పాలగిరి, బుసిరెడ్డిపల్లి, పోచంరెడ్డిపల్లె గ్రామాల్లో పంట పొలాలకు నీరు అందించేందుకు సర్వరాయ సాగర్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించడంతో పాటు అన్ని చెరువులను నీటితో నింపడం జరుగుతోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. కడప ఎంపీ అభ్యర్థి అవినాష్ రెడ్డిని, నన్ను మంచి మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి కమలాపురం చరిత్రను తిరగ రాద్దామని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా నాయకుడు సాయినాథశర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నిత్యం రాష్ట్ర ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అటువంటి నాయకున్ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

మంచి మనసున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి

వల్లూరు : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ సుపరిపాలనతో మంచి మనసున్న మారాజుగా అందరి మనసుల్లో నిలిచిన జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని గోటూరు గ్రామ పంచాయతీలోని గోటూరు, ఎస్సీ కాలనీ, వెంకటేశాపురం గ్రామాలలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొని ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్ఆర్‌సీపీ కడప పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు ఇంటి వద్దే అందుతాయన్నారు.

అవ్వా తాతలకు ఇస్తున్న పెన్షన్లను అడ్డుకున్న టీడీపీ అధికారంలోకి వస్తే గతంలో మాదిరిగా జన్మభూమి కమిటీలు పెత్తనం చెలాయిస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, స్థానిక నేతలు శివకుమార్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, రామాంజనేయరెడ్డి, నిత్యానంద రెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, పుత్తా యల్లారెడ్డి, గోసుల శివారెడ్డి, నూతేటి రవి, కృష్ణమూర్తి, జంగిడి సుబ్బరాయుడు, పుటిక శంకర్, నరసింహులు, రాజా, సుబ్బయ్య, శేషగిరి, పొట్టిపాటి ఈశ్వర్‌రెడ్డి, శివయ్య, నాగ సుబ్బయ్య, నారాయణ వెంకట శివ, సుబ్బయ్య, శివాల్‌పల్లె శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతను మరో సారి సీఎం చేద్దాం

కమలాపురం : వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు అందించి సంక్షేమ ప్రదాతగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి సీఎం చేద్దామని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి ప్రజలను కోరారు. గురువారం మండలంలోని చదిపిరాళ్లలో ఎంపీపీ గండి భారతి, సర్పంచ్ నాగరత్నమ్మ, ఎంపీటీసీ ప్రభావతమ్మలతో కలసి ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. మీ కుటుంబానికి వైఎస్సార్ సీపీ పాలనలో మేలు జరిగితేనే జగనన్నకు ఓటు వేయాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగనన్న సంక్షేమ ప్రదాతగా నిలిచారన్నారు. ఈ సంక్షేమ ప్రదాతకు మరో సారి సీఎం చేసుకుందామని ఆమె పిలుపునిచ్చారు. చంద్రబాబు వస్తే ఇబ్బందులు తప్పవన్నారు. ఆయన చేసిన పనికి ప్రస్తుతం పింఛన్ల కోసం పండుటాకులు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాల కోసం ఇలాంటి ఇబ్బందులే పడాల్సి వస్తుందన్నారు. అదే జగనన్న సీఎం అయితే అర్హత ఉంటే చాలనీ, సంక్షేమ పథకాలన్నీ ఇంటికే వస్తాయన్నారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డిల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో వారిని గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, మునీంద్రారెడ్డి, జయసుబ్బారెడ్డి, బాబు, పుత్తా మధు, ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నిఖిల్ రెడ్డి, ఇర్ఫాన్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండటం టీడీపీకి ఇష్టం లేదు

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండటం చంద్రబాబునాయుడుకు, కూటమి పార్టీలకు ఇష్టంలేదని సీకేదిన్నె జడ్పీటీసీ సభ్యుడు పి.నరేన్ రామాంజులురెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బుగ్గలపల్లి, బుగ్గలపల్లి దళితవాడ, గూడవాండ్లపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, వేయించి వైయస్సార్‌సీపీ అభ్యర్థులు ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డిని, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ఇంటికి వెళ్లి పింఛన్లను, ప్రభుత్వ పథకాలను అందిస్తున్న వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసేందుకు చంద్రబాబునాయుడు చేసిన కుట్రలు అన్నీ ఇన్నీ కాదన్నారు. వేసవిలో పండుటాకులు అయిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తిరిగి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో ప్రజలకు ఏ ఒక్క సంక్షేమ పథకం ఇంటి వద్దకు చేరదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు ఉప సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


గోటూరులో ప్రచారంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి


సీకేదిన్నె : ఎన్నికల ప్రచారంలో జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులు రెడ్డి


చదిపిరాళ్లలో ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

క్లుప్తంగా

నగరంలో చలివేంద్రాలు అవసరం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మండుతున్న ఎండలకు నగరంలోని పలు కూడళ్లలో కూడళ్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.ప్రసాద్ కోరారు. స్థానిక ఆర్సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చి ప్రజలను వడదెబ్బ నుంచి రక్షించాలని కోరారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెంచి చల్లని వాతావరణం ఉండేలా చూడాలన్నారు. అధిక వేడితో వృద్ధులతోపాటు యువకులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఖాసీం పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ పఠనం

కడప కల్చరల్ : తిరుమల-తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకను ఈ నెల 9న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. కడప నగరం గడ్డిబజారులోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఉదయం ఆరు గంటలకు నవ కలశ స్థాపన, తిరుమంజనం, విశేషాలంకారం, అర్చన, నివేదన, తీర్థ ప్రసాద వినియోగం ఉంటాయన్నారు. సాయంత్రం 5 గంటలకు టీటీడీ వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆగమ సలహాదారులు డాక్టర్ కేహెచ్.వరదరాజన్ (రాజేష్ స్వామి) పంచాంగ పఠనం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు తమ రాశి ఫలాలను తెలుసుకోవచ్చని ఆయన వివరించారు.

కేంద్ర బలగాల కవాతు


కేంద్ర సాయుధ బలగాలతో 'ఫ్లాగ్ మార్చ్' నిర్వహిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలు గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కడప తాలూకా సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, సిబ్బందితో పాటు 'సశస్త్ర సీమాబల్ (ఎస్.ఎస్.బి) బలగాలతో వీంద్ర నగర్, నబీ కోట, కాగితాలపెంట, ఐ.టీ.ఐ సర్కిల్ మీదుగా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కవాతు చేస్తున్నామని పోలీసులు సంకల్పించారు. ప్రజల్లో వున్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించారు.

టిఫిన్ సెంటర్ ప్రారంభం


టిఫిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మల్లికార్జునరెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని రాజారెడ్డి వీధిలో నూతనంగా ఏర్పాటుచేసిన ఫుడ్‌నేషన్ టిఫిన్ సెంటర్‌ను డిప్యూటీ సీఎం అంజద్ బాషా, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె సురేష్ బాబు, ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మెన్ ఎ.మల్లికార్జునరెడ్డిలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటల్ రంగంలో అనుభవం ఉన్న కేఎం.రషీద్ ఖాన్, హైదర్‌ఖాన్, ఫవాజ్‌ఖాన్‌లు మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఆ పార్టీ నాయకులు యల్లారెడ్డి, కిరణ్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు తక్షణమే వేతనాలు ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ పేర్కొన్నారు. నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ రూ.3500 పెట్టి రికార్డులు కొనండంటూ నోడల్ ఆఫీసర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు ఆశా కార్యకర్తలను బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఉగాది, 11వ తేదీన రంజాన్ పండుగలు ఉన్నా, ఇంతవరకు వేతనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. తక్షణం వేతనాలు చెల్లించకపోతే ఆందోళన చేపడుతామని ఆయనహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి శాంతమ్మ, అమ్ములు, పెద్ద అనసూయ, వరలక్ష్మి, అనిత, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.